
విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించి సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా మెరుగైన విద్యుత్‌ను అందించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీఅలీని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న ఎల్‌సీ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

- బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్లు,, పోల్స్ సిఫ్టింగ్ తరలింపు కోసం ఎల్‌సి అనుమతులు ఇవ్వాలన్నారు.
- బాచుపల్లి - మల్లం పేట్ - బౌరంపేట్ మార్గంలో చేపడుతున్న హెచ్ఎండిఏ రోడ్డు విస్తరణ పనుల్లో ఆటంకంగా ఉన్న విద్యుత్ పోల్స్, విద్యుత్ వైర్ల తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.


టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీని కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్

- బౌరంపేట్, బాచుపల్లి (తెలుగు యూనివర్సిటీ), మలంపేట్ (శంభీపూర్) ప్రాంతాలలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం కేటాయించిన భూముల్లో సబ్ స్టేషన్, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, బాచుపల్లి, శంభీపూర్, బౌరంపేట్ తదితర ప్రాంతాల్లో ఆటంకం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు 33 కెవి లైన్ మంజూరు చేయాలన్నారు.
- మల్లంపేట్ (శంభీపూర్)లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు 33 కెవి లైన్ ఏర్పాటు చేయాలని, దుండిగల్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులకు నూతన విద్యుత్ కనెక్షన్ అందజేసి నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా బహదూర్ పల్లి - కొంపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేపట్టేందుకు పనులు వేగంగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రాంచందర్‌రావు, పీకే సింగ్ రాథోర్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు కోరారు. ఈ సందర్భంగా అఖిల భారత పెన్షన్ అసోసియేషన్ ఉద్యోగుల కన్వీనర్ పీకే సింగ్‌రాథోర్‌తో కలిసి రెండు వినతి పత్రాలను అందజేశారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి త్వరలో సంబంధిత అధికారులతో చర్చిస్తానన్నారు. పెన్షన్ పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మేడూరి విజయబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీలను అరికట్టండి



కుత్బుల్లాపూర్ : మర్రి నారాయణరెడ్డి నగర్ రోడ్ నెంబర్ వన్ లో డ్రైనేజీ మ్యాన్ హోల్ మరమ్మతులకు నోచుకోకలేకపోవడంతో ప్రతి నాలుగు ఐదు రోజులకు ఓసారి డ్రైనేజీ నీరు పొంగిపోవడం పరిపాటిగా మారిందని కాలనీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై వాటర్ బోర్డు మేనేజర్ శివప్రసాద్ కు వివరించినా పట్టించుకోవడంలేదని ప్రతినిత్యం డ్రైనేజీ కంపుతో అటు ఇటు నడిచేవారు.. వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని తక్షణం మరమ్మతులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మ్యాన్‌హోళ్ల నిర్వహణ అధ్వానం



నిజాంపేట్: డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్వహణ లోపించడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి సాయినగర్‌లో ఇటీవల డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదు. దీంతో స్థానికులే మ్యాన్‌హోల్‌పై ప్రమాదసూచికను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ధ్వంసమైన మ్యాన్‌హోళ్లపై మూతలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు త్వరగా చేపట్టండి

కుత్బుల్లాపూర్ : సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోగల సూరారం కాలనీ,మైత్రి నగర్, పాండు బస్తీ, సాయి బాబా నగర్, హమీద్ బస్తీ తదితర బస్తీలలో మంజీరా నీరు రాక సుమారు 9 రోజులు అవుతోందని స్థానికులు వాపోతున్నారు. మహిళలు కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి మంచి నీటి సమస్యపై ఆరా తీశారు. మోటార్లు మరమ్మతుకు గురయ్యాయని అధికారులు సమాధానం ఇచ్చారు. త్వరతగతిన రిపేర్ చేసి నీటిని విడుదల చేయాలనీ తెలిపారు. ఈ విషయపై మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి బుధవారం వాణి కెమికల్ వద్ద గల రిజర్వాయర్ వద్దకు వెళ్లి వెళ్లి మోటారు మరమ్మత్తుల పని ఎలా జరుగుతుంది అని తెలుసుకున్నారు. ఏజీఎం రాజేష్, ఏ ఈ అనూష లతో మాట్లాడి సాయంత్రం లోగ కొన్ని బస్తిలకు నీరు అందించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు బుధవారం ఆయనను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ఆయనకు వివరిస్తు వినతి పత్రాలను అందజేశారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'తెలంగాణ మాదిగ హక్కుల దండోరా'కు రండి


కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న సంఘం రాష్ట్ర నాయకులు

నిజాంపేట్: తెలంగాణ మాదిగ హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేష్, రాష్ట్ర అధ్యక్షుడు కత్తి లింగన్న, ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజులు బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని నిజాంపేట్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7నుండి 20వ తేదీ వరకు కొనసాగనున్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఈ సందర్భంగా సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని ఆహ్వానించారు.

బీజేపీ స్థానిక అధ్యక్షుల నియామకం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు మూడు విభాగాలుగా విభజించామని జిల్లా ఇంఛార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ విభాగాన్ని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్‌లుగా విడదీశారు. నిజాంపేట్‌కు సతీష్‌ముదిరాజ్ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా, తాజాగా బాచుపల్లికి ప్రసాద్‌రాజు, ప్రగతినగర్‌కు నరేంద్రచౌదరి లను అధ్యక్షులుగా ప్రకటించారు. బుధవారం అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు.

విద్యార్థులకు సత్కారం



సుభాష్‌నగర్: టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గాజుల రామారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, గుడివాడ సురేష్, నరేంద్రల ఆధ్వర్యంలో ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు పురస్కారాన్ని ప్రకటించగా ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ రావులశేషగిరి వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయినాథ్ నేత, మురళీకృష్ణ, లక్ష్మణ్, వినయ్ కుమార్, శంకర్, ప్రతాపరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: మానవ మనుగడకు చెట్లే ఆధారమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 75వ వనమహోత్సవ కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్‌కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను విస్తృత స్థాయిలో పెంచినప్పుడే సకాలంలో వర్షాలు కురిసి పంటలు సంవృద్ధిగా పండుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహా వివిధ విభాగాల అధికారులు, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ రఘువీర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- సుభాష్‌నగర్ డివిజన్ పాండు బస్తిలో ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డితో కలిసి స్థానిక సమస్యలపై పర్యటించారు. సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని, వర్షాకాలంలో నీటమునిగే ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. డీఈఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, వాటర్ వర్క్స్ డీజీఎం రాజేష్, మేనేజర్ అనూష, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్ తదితరులు ఉన్నారు.

పరామర్శ


బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు మొహమ్మద్ అహ్మద్ గౌతమ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా బుధవారం మొహమ్మద్ అహ్మద్ గౌతమ్‌ను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి


బాచుపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

నిజాంపేట్: కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంతో పాటు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఈ నెల 10న కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణను నిలిపివేయాలన్నారు. హమాలి ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఎల్లమ్మ, కిషన్, రత్నం, యాదగిరి, మాణిక్యం, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు తదితరుల పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ సంఘటనపై చర్యలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ సుల్తాన్‌పూర్ కళాశాలలో జరిగిన వ్యవహారాన్ని జేఎన్‌టీయూహెచ్ అధికారులు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించినా పరిస్థితిని చక్కదిద్దలేక పోయారని జేఎన్‌టీయూ జేఏసీ నేతలు అన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్ మాట్లాడుతూ... వారం రోజులుగా ఆహారం విషయంలో తరచూ ఆందోళనలు చేస్తున్నా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ నిబంధనలు పాటించని వారికి లైసెన్సులను వెంటనే రద్దు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని రిజిస్ట్రార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

ఘనంగా వడ్డేపల్లి నర్సింగ్‌రావు జయంతి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ వడ్డేపల్లి నర్సింగ్‌రావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివేకానంద నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని వడ్డేపల్లి నర్సింగ్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఉన్న తాంద్రపాపారాయుడు సర్కిల్, అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న వీఎస్ఆర్ విగ్రహాలకు ఆయన కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యారావు విచ్చేసి కేక్ కట్‌చేశారు.

బిల్డర్ల సమస్యలను పరిష్కరించండి

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని బుధవారం బిల్డర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేక విజయసాయి, శ్రీధర్‌రెడ్డి, కిరణ్, లయన్ డా.కిరణ్, కాశీప్రసాద్, ఆర్‌వీ రావు, సుదర్శన్‌రెడ్డి, డా. సత్యం శ్రీరంగం, నేరేడ్కో ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛ స్ఫూర్తి?

- రోడ్లపైనే తొలగించిన చెట్ల కొమ్మలు
- ఎక్కడికక్కడే మట్టి దిబ్బలు


శ్రీ సాయినగర్‌లో రోడ్డుపై పేరుకుపోయిన మట్టి దిబ్బలు, కొట్టేసిన చెట్ల కొమ్మలు

చింతల్: జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్వచ్ఛ హైదరాబాద్ నినాదానికి తూట్లు పొడుస్తున్నారు. ఓవైపు విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించి రోజుల తరబడి రోడ్లపై పడేస్తుండగా మరోవైపు జీహెచ్ఎంసీ అధికారులు సైతం రోడ్లపై పనులు చేపట్టి మట్టిదిబ్బలు అలాగే వదిలేస్తున్నారు. వీరికి తోడుగా తామేమీ తక్కువ కాదన్నట్లుగా కొంతమంది స్థానికంగా ఉండేవారు సైతం తమ ఇళ్లల్లో వెలువడిన, నిర్మాణాలు చేపట్టిన డెబ్రిస్‌ను సైతం అక్కడే పోసి రోడ్డుకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. చింతల్ డివిజన్ శ్రీ సాయినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పైపులైను పూర్తి చేసే క్రమంలో అక్కడ వెలువడిన మట్టి దిబ్బలను రోడ్డు పక్కకు పోసి తను మాత్రం పనులు పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఆ మట్టిని అక్కడి నుంచి తరలించాల్సి ఉన్న సదరు కాంట్రాక్టర్ మట్టిని అలాగే వదిలేసి పత్తా లేకుండా పోయాడు. పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని విద్యుత్ సిబ్బంది కొమ్మలను సైతం కొట్టేసి అలాగే రోడ్డు పక్కన వదిలేసి సుమారు నెలరోజులు దాటినా వాటిని తరలించడం లేదు. దీంతో అటుగా వెళ్లే పాదాచారులతో పాటు వాహనదారుల సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్లు మరియు గల్లీలో ఉన్న మట్టి దిబ్బలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


షాపింగ్‌మాల్స్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆల్వాల్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలవాలని ఆల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం సుచిత్ర చౌరస్తాలోని నారాయణ సిల్క్స్, తరుణి, నీరూస్, నార్‌సింగ్ షాపింగ్ మాల్స్ సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించిన నాగరాజు మాట్లాడుతూ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలపరాదని, అదే విధంగా రూల్స్‌ను పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వివిధ మాల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కిషన్

సుభాష్‌నగర్: అప్రెంటిషిప్ జాబ్‌మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి కిషన్ అన్నారు. బుధవారం బహదూర్‌పల్లి చౌరస్తాలోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో ఈ నెల 12న జరిగే జాబ్‌మేళా నేపథ్యంలో ప్రిన్సిపాల్ షేక్‌మైమూన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కిషన్ హాజరయ్యారు. ఎలక్ట్రీషన్ టెక్నీషియన్ ,ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఉమెన్స్), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కన్స్ట్రక్షన్ టెక్నాలజీ , ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ టెక్నీషియన్ , అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విభాగాలకు సంబంధించి 20 కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్ట్ చేయనున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతస్థితిలో స్థిర పడాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల మేడ్చల్ ప్రిన్సిపాల్ హిమయతుల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను ఐక్యంగా కాపాడుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న భవన నిర్మాణ, ఆటో యూనియన్ నాయకులు

కుత్బుల్లాపూర్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు ఐక్యంగా ఉండి కాపాడుకోవాలని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయు కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో జీడిమెట్ల పారిశ్రామికవాడ, షాపూర్‌నగర్ మెయిన్ రోడ్డులోని రైతు బజార్ నుండి సాగర్ హోటల్ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణ్, వెంకన్న, దేవదానం మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, కార్పొరేట్ శక్తులకు కార్మికులకు బానిసలుగా చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని, అదానీ, అంబానీలకు వందలాది కోట్లను రాయితీలు కల్పిస్తూ దేశ సంపదను దోచి పెడుతోందని ఆరోపించారు. దేశంలో దాదాపు 40 కోట్ల మంది అసంఘటితరంగ హమాలి. భవన నిర్మాణ. ఆటో కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ పీఎఫ్ లాంటి సౌకర్యాలు ఉండటం లేదన్నారు. వారికి ఏదైనా ప్రమాదం జరిగే వారి కుటుంబాలు రోడ్డున పడుతన్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలు సంఘిటితంగా కార్మికులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకయ్య, ప్రసాద్, కరుణాకర్, తిమ్మప్ప, దుర్గా, నాయక్, ఏసు, శ్రీశైలం,ఎల్లయ్య, ఖలీల్ తదితరులు ఉన్నారు.

జూద కేంద్రంపై పోలీసుల దాడి

కుత్బుల్లపూర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్ నగర్‌లోని ఓ ఫ్యాన్ తయారీ పరిశ్రమలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఉమేష్, ఎండీ సిరాజ్, మనోజ్‌కుమార్, సురేష్, హరేరామ్‌సింగ్, రాజేష్‌కుమార్‌లు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి రూ. 71,670 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.